

హుండీ లెక్కింపు

అలంపూర్ ఆలయాల హుండీ లెక్కించగా రూ.84.43 లక్షల ఆదాయం వచ్చింది.

వివరాలు 8లో ▸



కృష్ణమ్మ పరుగులు

జూరాల ప్రాజెక్టు ఐదు క్రస్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.6 /22.8

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎఫ్‌బీ నమోదులో మొదటి స్థానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్-23లో భాగంగా చేపట్టిన 'సిటిజన్ ఫీడ్ బ్యాక్ (సీఎఫ్‌బీ) నమోదులో తాజాగా పాలమూరు పట్టణం రాష్ట్రంలోనే మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఇక జాతీయస్థాయిలో 15వ స్థానం దక్కించుకుంది. ఈ కార్యక్రమం గత నెల 1న ప్రారంభం కాగా ఈనెల 15వ తేదీ వరకు కొనసాగనుంది. ఈనెల 2వ తేదీ వరకు రెండో స్థానంలో ఉండగా గురువారం ఏకంగా మొదటి స్థానానికి చేరుకుంది. కొన్ని రోజులుగా మున్సిపల్ అధికారులు, సిబ్బందితో పాటు మెప్మాకు చెందిన ఆర్‌పీలు, సీఓలు నిత్యం పట్టణంలో విస్తృతంగా తిరిగి పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు ఎలా ఉన్నాయో ప్రజలతో అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 40,736 మందితో ఈ వివరాలను 'స్వచ్ఛ యాప్'లో నమోదు చేయించారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డిగ్రీ పూర్తయిన తర్వాత వచ్చే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ గిరిజ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వాసవీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు 'హాయ్ ఫ్రెషర్స్' పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు త్వరితగతిన ఉపాధి అవకాశాలు అందేలా అనేక కొత్త కోర్సులను ప్రవేశపెట్టామని, వీటి ద్వారా డిగ్రీ పూర్తయిన తర్వాత అవకాశాలు లభిస్తాయన్నారు. కళాశాలలోని అన్ని వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని విద్యార్థులు డిగ్రీలో మంచి మార్కులు సాధించాలన్నారు. సాంప్రదాయాలు, సంస్కృతి, విలువలతో కూడిన విద్య ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజ్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసయ్య, అకాడమిక్ డైరెక్టర్ రజినీకాంత్ పాల్గొన్నారు.

13న రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో 4, 5 తరగతుల ప్రవేశాల కోసం ఈనెల 13న హైదరాబాద్‌లోని హకీంపేటలో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 13న జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లాస్థాయి సెలక్షన్స్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. 4వ తరగతిలో 12 మంది బాలురు, 10 మంది బాలికలు, 5వ తరగతిలో 12 మంది బాలురు, 13 మంది బాలికలు రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైనవిద్యార్థులు హకీంపేటలో ఈనెల 12న మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని సూచించారు. 10 పాస్ పోర్ట్ ఫొటోలు, పాఠశాల, మున్సిపాలిటీ లేదా తహసీల్దార్ కార్యాలయం నుంచి జనన ధ్రువీకరణ పత్రం, ప్రస్తుత పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్, 3, 4 తరగతుల ప్రోగ్రెస్ రిపోర్ట్, ఆధార్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్‌తో ఎంపికల్లో పాల్గొనాలని సూచించారు.

రైతుల ఆత్మహత్యలకు బాధ్యులెవరు?




ఎర్రవల్లిచౌరస్తా: అప్పుల బాధతో ఇప్పటి వరకు ఆత్మహత్య చేసుకున్న రైతుల చావుకు బాధ్యులెవరని, ప్రభుత్వానికి ఎన్నికలకు ముందే పథకాలు గుర్తొస్తాయా అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బహుజన రాజ్యాధికార పాదయాత్ర గురువారం మండలంలోని ఇటిక్యాల, మునుగాల, నక్కలపల్లి, కొత్తదేవరపల్లిలో కొనసాగింది. ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సకాలంలో రుణమాఫీ చేయకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వం రూ.వేల కోట్లను ఖర్చు చేసి ఓట్లను దండుకోవడం కోసం ముందస్తు మద్యం టెండర్లకు సిద్ధమైందన్నారు. ఎన్నికల కోసమే ప్రభుత్వం రుణమాఫీ చేపట్టి, ఆర్టీసీని విలీనం చేసిందన్నారు. ఐదేళ్లుగా రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేసిన కేసీఆర్ ఎన్నికలకు ముందు మాఫీ చేయడం సిగ్గుచేటన్నారు. ఆర్టీసీ ఆస్తులను, భూములను అమ్ముకోవడం కోసమే ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు.

పనితీరే ప్రామాణికం

జేపీఎస్‌లకు మార్కులు వేస్తున్న అధికారులు

- నెలరోజుల్లో ప్రక్రియ పూర్తిచేయాలని నిర్ణయం
- క్షేత్రస్థాయి పర్యటనలో అధికారులు
- 226 మంది జేపీఎస్‌లకు నాలుగేళ్ల సర్వీస్ పూర్తి
- జిల్లాలో 441 గ్రామ పంచాయతీలు



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) క్రమబద్ధీకరణ ప్రక్రియ మొదలైంది. నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు జేపీఎస్‌ల పనితీరును మూల్యాంకనం చేసేందుకు జిల్లాలో కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఏఎస్పీ రాములు, డీఎఫ్‌ఓ సత్యనారాయణ, డీపీఓలు పర్యటిస్తున్నారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో కలిసి గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలిస్తున్నారు. ఎవాల్యుయేషన్ యాప్‌లో ఆయా పనుల ఆధారంగా మార్కులు అప్‌లోడ్ చేస్తున్నారు.

కాంట్రాక్టు ప్రాతిపదికన..

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం 2019, ఏప్రిల్ 12న నియమించింది. మొదటి మూడేళ్ల కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాల్లో నియమించుకోగా.. పని ఒత్తిడి కారణంగా చాలామంది మధ్యలోనే మానేశారు. వారి స్థానంలో నాలుగైదు విడతలుగా కొత్త వారిని తీసుకున్నారు. మూడేళ్ల సర్వీస్ పూర్తయిన తర్వాత రెగ్యులర్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం గతేడాది జీఓ 26 ద్వారా ప్రొవిజన్ కాలాన్ని మరో ఏడాది పెంచగా.. ఏప్రిల్ వరకు ముగిసింది. దీంతో తమను రెగ్యులరైజ్ చేయాలని గత ఏప్రిల్ 28 నుంచి 16 రోజుల పాటు జేపీఎస్‌లు సమ్మెకు దిగారు. అయితే సమ్మెపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడంతో మే 13న తిరిగి విధుల్లో చేరారు. ఆ తర్వాత జేపీఎస్‌లను రెగ్యులర్ చేయస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ఆశలు రేకెత్తాయి. తాజాగా ఎనిమిది మార్గదర్శకాలు విడుదల చేసి ఇందులో వారి పనితీరు ఆధారంగా మార్కులు ఇచ్చి పర్మినెంట్ చేస్తామని ప్రభుత్వం చెబుతుంది.

మార్కుల కేటాయింపు ఇలా..

- రోడ్లు, డ్రెయినేజీలు, శుభ్రం దోమల నివారణ చర్యలు, పంచాయతీ రికార్డుల నిర్వహణ, డంపింగ్ యార్డు, వర్మీ కంపోస్టు తయారీ, వైకుంఠధామం నిర్వహణ, పన్ను వసూలు, మొక్కల పెంపకం, క్రీడా ప్రాంగణ నిర్వహణ పక్కాగా చేపడితే 35 మార్కులు కేటాయిస్తారు.
- వంద శాతం ఇంటి పన్నుకు 10 మార్కులు.
- నర్సరీ, మొక్కల పెంపకం, పంపిణీకి 10 మార్కులు.
- రోడ్ల పక్కన ఇళ్లలో, పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటడం, తోటల పెంపకానికి 10 మార్కులు.
- విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐ చెల్లింపునకు 10 మార్కులు.
- పంచాయతీ నిధుల నుంచి 10 శాతం గ్రీన్ బడ్జెట్‌కు కేటాయిస్తే 5 మార్కులు.
- తడి, పొడి చెత్త సేకరణకు 15 మార్కులు.
- జనన, మరణాల రికార్డుల నిర్వహణకు 5 మార్కులు కలిపి మొత్తం 100 మార్కులు ఇవ్వనున్నారు.

త్రిసభ్య కమిటీ ఏర్పాటు..

నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పని తీరే ప్రామాణికంగా క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. గ్రామాల్లో అభివృద్ధి పనుల మూల్యాంకనానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అధ్యక్షతన ఏఎస్పీ లేదా డీఎస్పీ, జిల్లా అటవీ శాఖాధికారితో కూడిన త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ కమిటీ గ్రామాల్లో రోడ్డు మురుగు కాల్వల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, కంపోస్టు ఎరువుల తయారీ, పన్ను వసూళ్లు, మొక్కల సంరక్షణ, చెత్త డంపింగ్ యార్డు నిర్వహణ, ట్రాక్టర్ ఈఎంఐలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు తదితర వాటిని పరిశీలించి మార్కుల రూపంలో ఎవాల్యుయేషన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. జిల్లావ్యాప్తంగా 15 రోజుల క్రితం ఈ ప్రక్రియ ప్రారంభించారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



ప్రభుత్వ ఆదేశాల మేరకు నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారి పనితీరు మదింపు ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లాలో మొత్తం 324 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉండగా.. ఇందులో 226 మంది నాలుగేళ్లు పూర్తి చేసుకున్న వారున్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, డీపీఓ

226 మంది జేపీఎస్‌లు..

జిల్లాలో 441 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇందులో 324 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. వీరిలో 226 మంది నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు 84 మంది, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారు (ఓపీఎస్) 33 మంది ఉన్నారు.

- జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణను నెల రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున ఆ లోగానే పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్యదర్శుల పనితీరును మదింపు చేస్తున్నారు.



రాజాపూర్ మండలంలోని మల్లేపల్లి జీపీలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కమిటీసభ్యులు

ఎక్సైజ్‌లో టెండర్ల జాతర

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి జిల్లాలో 230 మద్యం దుకాణాలకు నేడు గెజిట్ విడుదల
- రిజర్వేషన్ ప్రకారం దుకాణాల కేటాయింపు



లక్కీడిప్ ద్వారా దుకాణాల రిజర్వేషన్ కేటాయిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ క్రైం: ఎక్సైజ్ శాఖలో టెండర్ల జాతర మొదలు కానుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి ఆయా కలెక్టరేట్‌లలో టెండర్లు స్వీకరించనున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు సంబంధించిన మద్యం దుకాణాల టెండర్లు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో స్వీకరించనున్నారు. సర్కిల్ వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఆయా పరిధిలో ఉన్న దుకాణాలకు దరఖాస్తులు తీసుకుంటారు. ఉమ్మడి జిల్లాలో 230 మద్యం దుకాణాలు ఉంటే ఇందులో 15 శాతం గౌడ్‌లకు, 10 శాతం ఎస్సీలకు, 5 శాతం ఎస్టీలకు కేటాయించారు. ఒక్కో దుకాణానికి రూ.2 లక్షలు టెండర్ డీడీ కేటాయించారు.

వెనుకబడిన కులాలకు చేయూత

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్థికంగా వెనుకబడిన కులాలకు చేయూతనివ్వడంలో భాగంగా నిబంధనల ప్రకారం జిల్లాలోని మద్యం దుకాణాలలో ఎస్సీ, ఎస్టీ, గౌడ కులాలకు లక్కీ డిప్ ద్వారా కేటాయింపులు చేసినట్లు కలెక్టర్ జి.రవినాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం లక్కీడిప్ కార్యక్రమంలో ఆయా దుకాణాలు కేటాయించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేటాయించిన దుకాణాలతో పాటు మిగిలిన జనరల్ దుకాణాలకు ఈనెల 21న కలెక్టరేట్ సమావేశ మందిరంలో లక్కీడ్రా తీయనున్నట్లు తెలిపారు. శుక్రవారం నుంచి 18వ తేదీ వరకు మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేటలకు కలిపి 90 మద్యం దుకాణాలు ఉంటే ఇందులో ఎస్సీలకు 10, ఎస్టీలకు 3, గౌడలకు 14 దుకాణాలు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన దుకాణాలు ఓపెన్‌లో ఉంటాయన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నుంచి ఆమోదం పొందిన వెంటనే అన్ని దుకాణాలకు గెజిట్ విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఎస్ సైదులు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఛత్రు నాయక్, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పాండు, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇందిర, నారాయణపేట బీసీ సంక్షేమ అధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

90.17 శాతం అల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణ

పాలమూరు: జిల్లా ఆరోగ్య శాఖలోని ఇమ్యునైజేషన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 1–19 ఏళ్లలోపు బాలబాలికలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేపట్టారు. జిల్లావ్యాప్తంగా బాలబాలికలను 2,78,511 మందిని గుర్తిస్తే ఇందులో 2,51,147 మందికి మాత్రలు పంపిణీ చేశారు. మొత్తంగా 90.17 శాతం పూర్తి చేశారు. మిగిలిన 27,364 మందికి ఈనెల 10న మాప్ ఆప్ కింద పంపిణీ చేయనున్నారు.

- జిల్లాలో 1–19 ఏళ్ల లోపు బాలబాలికల్లో నులిపురుగుల నిర్మూలన కోసం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ తెలిపారు. ఎదిర పీహెచ్‌సీ పరిధిలోని ఏనుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులుతో కలిసి విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ విద్యార్థులు మాత్రలు నమిలి పరిశుభ్రమైన మంచినీటితో మింగే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అల్బెండజోల్ తీసుకోవడం వల్ల నులిపురుగుల వ్యాప్తిని నివారించి, పిల్లలలో రక్తహీనత నివారించవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శంకర్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రఫీక్, డాక్టర్ అస్కర్ అలీ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మరమ్మతులు

అడ్డాకుల: జడ్చర్ల నుంచి కొత్తకోట వరకు 44వ నంబర్ జాతీయ రహదారిపై రెండు రోజులుగా గుంతలను పూడ్చేందుకు మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జాతీయ రహదారిపై ఇటు హైదరాబాద్, అటు బెంగళూర్ రోడ్లపై చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వాటిలో వర్షం నీళ్లు చేరి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. రహదారిపై ఏర్పడిన గుంతల్లో హాట్ మిక్స్ వేసి రూలింగ్ చేస్తున్నారు. ఇప్పటికే జడ్చర్ల, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల, పెద్దమందడి మండలాల్లో మరమ్మతులు పూర్తి చేశారు.

త్వరలో బీటీ రెన్యూవల్ పనులు

వేస్టన్ ఆంధ్రా టోల్‌వేస్ పరిధిలోని జడ్చర్ల నుంచి కొత్తకోట వరకు ఉన్న 44వ నంబర్ జాతీయ రహదారిపై బీటీ రెన్యూవల్ చేసే పనులు త్వరలో చేపట్టనున్నారు. ప్రతి రెండేళ్లకోసారి బీటీరోడ్డును రెన్యూవల్ చేస్తారు. గతంలో పోల్కంపల్లి, అన్నాసాగర్ వద్ద రెన్యూవల్ చేసిన రెండు, మూడు రోజులకే వర్షం పడటంతో రోడ్డు పాడైంది. అటువంటి ప్రాంతాల్లో ఈసారి అవసరమైన చోట ఒక లేయర్‌ను తొలగించి బీటీని వేయనున్నట్లు తెలిసింది.



హైవేపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మంత్రిని బర్తరఫ్ చేయాలి

పాలమూరు: మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సీఎం కేసీఆర్ ఎందుకు బర్తరఫ్ చేయడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎన్పీ వెంకటేష్ ప్రశ్నించారు. కోర్టు ఆదేశాల మేరకు మంత్రిపై కేసు నమోదు చేయడంతో పాటు మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ పాలమూరు బీజేపీ శాఖ ఆధ్వర్యంలో గురువారం పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా తెలంగాణ చౌరస్తాకు చేరుకుని అక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాంపల్లి కోర్టు సూచనల మేరకు మహబూబ్‌నగర్ పోలీసులు పారదర్శకంగా విచారణ చేసి కేసు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నా.. సీఎం వారిపై చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. గతంలో ఎలాంటి తప్పు చేయని ఈటల రాజేందర్‌ను మంత్రి పదవి నుంచి తొలగించిన క్రమంలో ఇప్పుడు ఏకంగా కోర్టు చెప్పిన కూడా మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఎందుకు బర్తరఫ్ చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, పాండురంగారెడ్డి, జయశ్రీ, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కస్తూర్బాలో ఆకలి కేకలు

- భోజనం లేక అల్లాడిన విద్యార్థులు
- సిబ్బంది డుమ్మాతో వంట బంద్
- ధర్నాకు దిగిన విద్యార్థులు
- డీఈఓ, తహసీల్దార్, ప్రత్యేకాధికారి విచారణ
- సమస్య పరిష్కరిస్తామని హామీ

జడ్చర్ల: బాలానగర్ మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో గురువారం విద్యార్థులు ఆకలితో అలమటించారు. సరైన భోజనం పెట్టకపోవడంతో విసిగిపోయిన విద్యార్థినులు ఒక్కసారిగా పాఠశాల ఆవరణలో ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 384 మంది ఉన్నారు. వీరికి ప్రతిరోజు వంట చేసేందుకు ఐదుగురు సిబ్బంది ఉండాల్సి ఉంది. అయితే రెండేళ్లుగా ఇద్దరు సిబ్బంది లేకపోవడంతో ముగ్గురే వంట చేస్తున్నారు. ఇటీవల ఒకరు పని మానేసి వెళ్లిపోగా.. మిగిలిన ఇద్దరు బుధవారం సాయంత్రం నుంచి అనారోగ్యం కారణంగా సెలవు పెట్టారు. దీంతో రాత్రి భోజనం వండకపోవడంతో విద్యార్థులు బొరుగులు తిని అర్ధాకలితో పడుకున్నారు. గురువారం ఉదయం ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి ఎలాగోలా ఉప్మా చేసి అందించారు. అయితే అది రుచిగా లేకపోవడంతో చాలా మంది తినలేదు. మధ్యాహ్నం కూడా వంట చేసే పరిస్థితి లేకపోవడంతో పాటు అప్పటికే ఇద్దరు విద్యార్థినులు నీరసించి పడిపోయారు. దీంతో ఆందోళనకు గురైన విద్యార్థులు పాఠశాల ఆవరణలో ధర్నాకు దిగారు. సమస్యలను పలుసార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని విద్యార్థులు తెలిపారు. ఉన్నతాధికారులు వచ్చి సమస్యలకు పరిష్కారం చూపే వరకు ఇక్కడే ఉంటామని భీష్మించుకుని కూర్చున్నారు.

పరిష్కారం కాని సమస్యలు

పాఠశాలలో నిత్యం అందించే ఆహారాన్ని నాసిరకంగా వడ్డిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. పాఠశాలకు తనిఖీ సమయంలో వచ్చిన అధికారులకు వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చే సమయంలో సమస్యలు, ఇబ్బందులు చెబితే తర్వాత తమపై మండిపడుతారన్నారని ఆరోపించారు. దీనికి తోడు తనిఖీలకు సంబంధించి ముందస్తు సమాచారం ఉండడంతో ఆ సమయంలో ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తారన్నారు. ఇతర రోజుల్లో నీళ్లతో కూడిన కూరలు వడిస్తారని విద్యార్థులు చెబుతున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న మినరల్ వాటర్ పనిచేయకపోవడంతో బోరు నీళ్లే తాగుతున్నామని తెలిపారు. గదులకు కిటికీలు లేక వర్షం పడితే విద్యార్థులు నిద్రపోలేని పరిస్థితి ఉందన్నారు. పాఠశాలలో బాత్రూంలు ఉన్నా కొన్నింటికి తలుపులు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. వంట చేసే ఆయాలు తమతో సేవలు చేయించుకుంటారని ఈ విషయాన్ని ప్రశ్నిస్తే ఉపాధ్యాయులకు చెప్పి బెదిరిస్తారని తెలిపారు. పాఠశాల ప్రహరీ గోడ దూకి ఆకతాయిలు ఆవరణలోకి ప్రవేశిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా మొక్కుబడిగా 4, 5 సార్లు పాఠశాలకు వచ్చి పరిశీలించారే గానీ.. ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కాగా.. గురువారం విద్యార్థినులను చూసేందుకు వచ్చిన కొందరు తల్లిదండ్రులు పరిస్థితిని గమనించి..పాఠశాల ప్రిన్సిపాల్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆందోళన గురించి తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ నాయకులు అక్కడకు చేరుకుని వారికి మద్దతుగా నిలిచారు. ప్రిన్సిపాల్, సిబ్బందిపై మండిపడిన వారు సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



కస్తూర్బా పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

అధికారుల విచారణ

విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి బాబురావు పాఠశాల వద్దకు చేరుకుని విచారించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి బాలికలకు భోజనం పెట్టడంతో పాటు విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న డీఈఓ రవీందర్ సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సమస్య చెబితే బెదిరిస్తారు



అధికారులు తనిఖీలకు వచ్చిన సమయంలో భోజనం, వసతులు, సమస్యలపై వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబితే తర్వాత మమ్మల్ని బెదిరిస్తారు. దీంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి. మాకు అందించే ఆహారంలో నాణ్యత పాటించడం లేదు. ఇష్టానుసారంగా వండి వడ్డిస్తున్నారు.

– సోని, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

సమస్యలు పరిష్కరించాలి



విద్యాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. వంట సిబ్బందికి తాము సహాయ పడాల్సి వస్తుంది. దీంతో మా చదువులకు ఆటంకం ఏర్పడుతుంది. ఏ విషయంపైన ప్రశ్నించినా తమన లక్ష్యంగా చేసి వేధిస్తారనే భయం ఉంది. ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి.

–గౌతమి, విద్యార్థిని

మా పిల్లలను ఇబ్బందులు పెట్టొద్దు..



ఎన్నో కష్టాలను అధిగమించి చదువు కోసం దూరంగా ఉన్న పాఠశాలకు మా పిల్లలను పంపిస్తాం. వారి యోగ క్షేమాలను చూసేందుకు వచ్చిన సమయంలో మాపై విద్యాలయ అధికారులు, సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తారు. లోపలికి అనుమతించేందుకు గేటు దగ్గర పడిగాపులు పడాల్సి వస్తుంది.

– లావణ్య, విద్యార్థిని తల్లి, ఏనుగొండ

ఉన్నతాధికారులకు నివేదించాం



వంట సిబ్బంది కొరత ఇబ్బందిగా ఉంది. సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాం. కెమిస్ట్రీ ఉపాధ్యాయురాలు మెటర్నిటీ సెలవుపై వెళ్లారు. విద్యార్థులు పేరెంట్స్‌ను సంబంధిత వేళల్లో లోపలికి అనుమతిస్తాం. ఇతర సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– జ్ఞానేశ్వరి, ప్రిన్స్‌పాల్, కస్తూర్బాగాంధీ విద్యాలయం

క్లుప్తంగా

తల్లికి చికిత్స కోసం వెళ్తుండగా..

● కారు, బొలెరో ఢీకొని ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు





కృపాకర్‌గౌడ్ (ఫైల్)

మక్తల్: కారు, బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని మంతన్‌గోడ్‌లో గురువారం తెల్లవారుజామున కర్ణాటకలోని మాన్వి పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మంతన్‌గోడ్ చెందిన తిరుపతమ్మ పెరాలసిస్‌తో బాధపడుతుంది. చికిత్స కోసం కర్ణాటక రాష్ట్రంలోని కార్వార్ జిల్లాలోని ఆయుర్వేద వైద్యం చేసుకుంటుంది. రెండోసారి తిరుపతమ్మ, ఆమె ఇద్దరు కుమారులు రాకేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్ తోపాటు వారి బంధువు కృపాకర్‌గౌడ్(25) కార్వార్ జిల్లాకు మంతన్‌గోడ్ నుంచి కారులో బయలుదేరారు. మాన్వి పోలీస్‌స్టేషన్ పరిధిలో బొలెరో వాహనం వీరి కారును ఢీకొనడంతో కృపాకర్‌గౌడ్ మృతి చెందగా, నరేందర్‌గౌడ్‌కు స్వల్పంగా, రాకేష్‌గౌడ్, తిరుపతమ్మకు తీవ్రంగా గాయాలయ్యాయి. తిరుపతమ్మను హైదరాబాద్‌కు, మిగతా ఇద్దరు రాయచూర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు మాన్వి ఎస్‌ఐ హిరేమత్ తెలిపారు. కృపాకర్‌గౌడ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


విద్యుదాఘాతంతో రైతు మృతి

మక్తల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని మంతన్‌గోడ్‌లో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కురుమయ్య(35) తన పొలంలో వరి నాటు వేసేందుకు నీళ్ల అవసరం వచ్చింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ పోవడంతో, ఫ్యూజ్ పెడుతున్న క్రమంలో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ అధికారులకు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయాలని చెప్పినా ఫలితం లేకుండా పోయిందని, దాంతోనే రైతుకు షాక్ తగిలిందని గ్రామస్తులు ఆరోపించారు. మృతుడికి ఏడాదిన్నర కిందటే వివాహమైందని, భార్య ఇప్పుడు గర్భవతిగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాపు చేస్తున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

నీటి గుంతలో పడి వృద్ధురాలు..

మరికల్: నీటి గుంతలో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం కన్మనూర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ ఆశమ్మ(65) బుధవారం గ్రామ పంచాయతీ దగ్గర పింఛన్ తీసుకొని ఇంటికి వచ్చింది. తర్వాత కల్లు దుకాణంలో కల్లు తాగి ఇంటిదారి మర్చిపోయి, గ్రామ శివారులో ఉన్న ఓ నీటి గుంతలో పడి మృతి చెందింది. ఈ విషయం స్థానికులు పోలీసులకు చెప్పడంతో వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



బాలపీరు(ఫైల్)

జడ్చర్ల: జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలు దాటుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణ కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చిన్న కార్వాములకు చెందిన బాలపీరు(65) స్థానిక రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా హజ్రత్ నిజాముద్దీన్–తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మృతదేహం లభ్యం



శంకరమ్మ (ఫైల్)

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడుమ కాల్వలో గల్లంతైన మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మండలంలోని మూలమల్లకు చెందిన శంకరమ్మ(65) గత ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. కొంతకాలంగా ఆమెకు మానసిక స్థితి బాగోలేదు. గ్రామ శివారులోని ఎన్‌టీఆర్ ప్రధాన ఎడుమ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. జూరాల ప్రాజెక్టు రెగ్యులేటర్ వద్ద గేట్లను మూయించి నాలుగు రోజులుగా రామన్‌పాడ్ ప్రాజెక్టు వరకు గాలింపు చేపట్టారు. గురువారం మూలమల్ల శివారులోని డీ 6 కాలువలో శంకరమ్మ మృతదేహం ఆచూకీ లభించింది. మృతదేహం బయటికి తీసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూరాల వద్ద కృష్ణమ్మ పరుగులు



జూరాలలో 5 గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం ప్రాజెక్టుకు 95వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, గురువారం ఉదయం 6 గంటలకు 1.04లక్షల క్యూసెక్కులకు పెరిగింది. ఆ తర్వాత 7 గంటలకు స్వల్పంగా తగ్గి క్రమంగా 87,528 క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో 16 క్రస్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మళ్లీ 9గంటలకు లక్ష క్యూసెక్కులు పెరిగి మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగింది. సాయంత్రం 3గంటలకు 98వేలు, రాత్రి 8గంటల వరకు 85వేల కూసెక్కులు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 87 క్యూసెక్కులు, నెట్టెంపాడు రెండు పంపుల ద్వారా 1,500, భీమా లిఫ్టు–1కు 1,300, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వ ద్వారా 730, సమాంతర కాల్వకు 700, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు, ప్రాజెక్టు నుంచి మొత్తం 64,897 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.645 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద కొనసాగుతుంది. ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 95,265 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 45,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా, 115.058 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 30.17 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 48వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 41,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నిరంతరాయంగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో వేగవంతంగా చేపడుతున్నారు. గురువారం 12 యూనిట్ల ద్వారా 472 మెగా వాట్లు పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 70.737 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని తెలిపారు. 41,752 క్యూసెక్కులను వినియోగించారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. గురువారం ఎగువ నుంచి 1,016 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ఒక గేటును తెరిచి 886 క్యూసెక్కులను దిగువకు వదిలి, 130 క్యూసెక్కులను కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

శ్రీశైలంలో 856.9 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 856.9 అడుగుల నీటిమట్టం, 96.9495 టీఎంసీల నీటినిల్వ ఉంది. సాయంత్రం 6గంటల సమయంలో జూరాల నుంచి 20,195, విద్యుదుత్పత్తి చేస్తూ 40,720, సుంకేసుల నుంచి 886 క్యూసెక్కులు మొత్తం 61,801 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తున్నాయి. 24గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 0.568 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి చేసి 977 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేశారు.

పోలీస్‌స్టేషన్ వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం



గట్టు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోవిందమ్మ

గట్టు: మండలంలో చోటు చేసుకున్న ఓ ఘర్షణలో వ్యక్తిని చితకబాదిన వ్యవహారంపై ముగ్గురిని విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా, అందులో ఓ వ్యక్తి తల్లి స్టేషన్ సమీపంలో చెట్టుకు ఉరేసుకునేందుకు ప్రయత్నించింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఎక్లాస్‌పురం చెందిన భీమేష్ సీడ్ పత్తి పొలంలో పని చేసేందుకు గొర్లఖాన్‌దొడ్డిలోని మేనత్త ఇంటికి వెళ్లాడు. మూడు రోజుల క్రితం భీమేష్ రాత్రి బహిర్భూమికి వెళ్లి వస్తున్న క్రమంలో ఇదే గ్రామానికి చెందిన కుర్వ శంకర్, బోయ మహేష్, ఈడిగ రమేష్ మద్యం మత్తులో భీమేష్‌ను కర్రలతో చితకబాదారు. గాయపడ్డ భీమేష్ మండల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ నిమిత్తం గురువారం కుర్వ శంకర్, బోయ మహేష్, ఈడిగ రమేష్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న కుర్వ శంకర్ తల్లి గోవిందమ్మ కూడా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. ఇదే క్రమంలో తన కొడుకును పోలీసులు ఏం చేస్తారో అని భయపడి స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు చీర కొంగుతో ఉరి వేసుకునేందుకు ప్రయత్నించింది. చుట్టుపక్కల వారు గమనించి, స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆమెను గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ఆమె గద్వాలలో చికిత్స పొందుతుంది. ఈ విషయంపై ఎస్‌ఐ నందికర్‌ను వివరణ కోరగా. అలాంటి ఘటన ఏమీ కాలేదని, పోలీస్‌స్టేషన్ సమీపంలో గోవిందమ్మ అనారోగ్యానికి గురికాగా ఆస్పత్రికి తరలించినట్లు తెలిసిందన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

భీమేష్‌పై దాడి చేసి, గాయపరిచిన కుర్వ శంకర్, బోయ మహేష్, ఈడిగ రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాల్వలను పట్టించుకోరా?

● టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి



దేవరకద్ర: కోయిల్‌సాగర్ కాల్వల గురించి పట్టించుకోరా? చెట్లు, ముళ్ల పొదలతో నిండి, తూముల సరిగ్గా లేక నీరంతా వృథా అవుతున్న అధికారులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం దేవరకద్రలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుడి, ఎడమ కాల్వల ఆధునీకీకరణ చేశామని చెబుతున్నా, పనులు సక్రమంగా చేయలేదని ఆరోపించారు. కుడి కాల్వ 16వ తూము నుంచి 29వ తూము వరకు ఎలాంటి పరిస్థితి ఉందో అధికారులు చూడాలని డిమాండ్ చేశారు. చివరి ఆయకట్టుకు సాగునీరందని పరిస్థితులున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రూ. 419 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకం ఏడేళ్ల క్రితమే పూర్తి అయిందన్నారు. కోయిల్‌సాగర్‌కు కేటాయించిన 3.9 టీఎంసీల నీటిని తెచ్చి ఆయకట్టు 50,250 ఎకరాలకు పెంచాలని, ఇప్పటి వరకు కోయిల్‌సాగర్ కింద ఒక ఎకరం ఆయకట్టు కూడా పెరగలేదని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి ప్రాజెక్టు పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అలంపూర్ ఆలయాల హుండీ లెక్కింపు



వచ్చిన ఆదాయాన్ని చూయిస్తున్న అధికారులు

● రెండు కౌంటింగ్ మిషన్లలో హెచ్చు నోట్లు
● హుండీలో విదేశీ కరెన్సీ, మిశ్రమ బంగారు, వెండి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు చేపట్టారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో రూ.84,43,063 ఆదాయం వచ్చినట్లు ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య తెలిపారు. గతేడాది 117 రోజులకు రూ.68,23,663 ఆదాయం రాగా, ఈ ఏడాది 175 రోజులకు లెక్కించారు. ఈ లెక్కింపు ఎస్‌బీఐ అధికారుల పర్యవేక్షణలో పూర్తయ్యింది. బ్యాంకు వారు తీసుకొచ్చిన నాలుగు కౌంటింగ్ మిషన్‌లలో రెండింటిలో లెక్క సరిగా రావడం లేదంటూ ధర్మకర్తలు గుర్తించారు. ప్రతి వంద నోట్లలో రెండు నుంచి నాలుగు అధికంగా రావడం గమనించారు. ఈ విషయమై సంబంధిత మేనేజర్ రమేష్ బాబును మాట్లాడుతూ.. రెండు మిషన్లు సరిగా పనిచేయడం లేదని చెప్పారు. మళ్లీ రెండు మిషన్‌లపై రీకౌంటింగ్ చేశారు. రెండు నకిలీ నోట్లు రావడంతో వాటిని అందరి సమక్షంలో చించేశారు. ప్రధాన ఆలయంలోని ఒక హుండీ తాళం మొరాయించి తెరుచుకోక పోవడంతో ఆ లెక్కింపు వాయిదా వేశారు. సింగపూర్ సంబంధించిన 10 డాలర్ల ఒకనోటు, అమెరికన్ 20 డాలర్ల ఒక నోటు, 10 డాలర్ల ఒక నోటు, 5 డాలర్ల నోట్లు రెండు, ఒక డాలర్ నోట్లు 5 వచ్చాయి. అమ్మవారి ఆలయంలో మిశ్రమ బంగారు 80.90గ్రాములు, 380 గ్రాముల వెండి, స్వామి వారి ఆలయంలో 33.670 గ్రాముల వెండి వచ్చినట్లు ఈఓ, చైర్మన్ తెలిపారు. ఇకపై హుండీ లెక్కింపు ఇంత ఆలస్యం చేయరాదని, మూడు నెలలకు ఒక సారి చేయాలని అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రాజు ఆదేశించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు వెంకటేశ్వర్‌రెడ్డి, చాకలి వెంకటేష్, వెంకట నారాయణరెడ్డి, సత్యన్న, అడవప్ప, ఎక్స్ అఫీషియో మెంబర్ ఆనంద్‌శర్మ ఉన్నారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



అరవింద్



రాఘవేందర్



లోకేష్

మహబూబ్‌నగర్ క్రీడలు: పుదుచ్చేరిలో శుక్రవారం నుంచి ఈనెల 6 వరకు జరగనున్న 28వ సబ్‌జూనియర్ జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. అరవింద్ నాయుడు, రాఘవేందర్, లోకేష్ రాష్ట్ర బాలుర జట్టులో చోటు దక్కించుకున్నారు. వీరి ఎంపికపై జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాదత్‌ఖాన్, అహ్మద్ హుస్సేన్, కార్యనిర్వాహక కార్యదర్శి సోహైల్ ఉర్ రహెమాన్, కోశాధికారి రాంమోహన్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని కోరారు.





నడిరోడ్డుపైనే పశువులు

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై పశువులు తిష్ట వేయడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రోజులుగా జడ్చర్ల- రాయచూర్ జాతీయ రహదారి (నం.167) పై మెట్టుగడ్డ నుంచి కొత్త బస్టాండు వరకు అటు, ఇటువైపు పదుల సంఖ్యలో పశువులు తిరుగుతున్నాయి. మున్సిపల్ జవాన్లు వాటిని పక్కకు తరిమినా.. కాసేపటికి మళ్లీ నడిరోడ్డుపైకి యథావిధిగా వస్తుండడంతో వాహనదారులు ఆగి పక్కకు వాటిని నెట్టి వెళ్లడం కనిపించింది.

- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

పశువులను తరుముతున్న మున్సిపల్ జవాన్

పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యం

● కల్వకుర్తిలో అభివృద్ధే లేదు
● టికెట్ ఎవరికీ ఇచ్చినా పనిచేస్తాం..
● మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్



మాట్లాడుతున్న మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్

కల్వకుర్తిరూరల్: బీఆర్‌ఎస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ అన్నారు. గురువారం పట్టణంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. బీఆర్‌ఎస్ విజయం సాధించాలంటే ఎవరికీ అవకాశం ఇవ్వాలో వారికే ఇస్తే బాగుంటుందనే విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. నియోజకవర్గ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఎమ్మెల్సీ కసిరెడ్డికి ఇవ్వాలని బీసీలకు ఇస్తే తనతో పాటు మరికొందరి పేర్లను పరిశీలించాలని కోరామన్నారు. కొంతమంది దుష్ప్రచారం చేస్తూ తప్పుదోవ పట్టించారని, స్థాయికి మించి మాట్లాడుతున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. మేము తలుచుకుంటే అంతకుమించి మాట్లాడే శక్తి ఉందన్నారు. అధిష్టాన నిర్ణయం శిరోధార్యం అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తప్ప నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గాభివృద్ధికి వరాలు ప్రకటించారని ఆ వరాలను 4ఏళ్లుగా సద్వినియోగం చేసుకోలేకపోవడమే బాధాకరమన్నారు. పలుమార్లు ముఖ్యమంత్రిని కలిసి అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని కోరితే ముఖ్యమంత్రి కాదనరని చెప్పారు. దేశంలోనే రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి అగ్రభాగాన నిలిపారని కొనియాడారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించడం వల్లే అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో బహిరంగసభ ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చినా తాము పార్టీకే పనిచేస్తామన్నారు. మా సేవలు వినియోగించుకోవాలనుకుంటే సహకరిస్తామని లేదంటే ఇంట్లో కూర్చుంటామని వెల్లడించారు.

‘ఎకో సెన్సిటివ్ జోన్’ ఏర్పాటుకు ప్రతిపాదన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కందనూలు: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్ చుట్టూ ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు నోటిఫై చేసేందుకు కేంద్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన అటవీశాఖ, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల, వ్యవసాయ, మైనింగ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమీక్షించారు. ఎకో సెన్సిటివ్ ప్రతిపాదనలు, వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ ఉద్యానవనాలు, వన్యప్రాణులు, అభయారణ్యాల చుట్టూ ఉన్న సున్నితమైన మండలాల కోసం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం 10 కిలో మీటర్ల పరిధిలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలు పూర్తి సమాచారంతో వచ్చే వారం నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించారు.

ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాస్థాయి కమిటీ ఆధ్వర్యంలో తప్పనిసరిగా అనుమతి పొందాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి మాట్లాడుతూ.. జాతీయ వన్యప్రాణుల బోర్డు 2020, నవంబర్ 4న నిర్వహించిన సమావేశంలో వన్యప్రాణుల సంరక్షణ వ్యూహం రూపొందించారన్నారు. పర్యావరణ సంరక్షణ చట్టం, పర్యావరణ రక్షణ నిబంధనలను అనుసరించి జాతీయ పార్కులు, వన్యప్రాణుల అభయారణ్యం పరిధిలో 10 కిలోమీటర్ల పరిధిలోని భూభాగం ఎకో సెన్సిటివ్‌గా నోటిఫై చేసినట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వచ్చే ఎకో సెన్సిటివ్ జోన్ మండలాలు, గ్రామాల వివరాలను తెలుపుతూ మ్యాప్‌ను ప్రదర్శిస్తూ వివరించారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పులులు, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన వివరించారు. నిషేధిత కార్యకలాపాలను, వాణిజ్య మైనింగ్, కాలుష్యానికి కారణమయ్యే పరిశ్రమలు, గాలి నీరు నేల శబ్దం వంటి పరిశ్రమలు, బహిర్గత విద్యుత్ తీగల ఏర్పాట్లు, రోడ్ల విస్తరణ నిషేధిత జాబితాలో ఉన్నాయన్నారు. వ్యవసాయ, ఉద్యాన పద్ధతుల వ్యవసాయ అనుబంధ రంగం కార్యకలాపాలను అనుమతించబడ్డాయని వివరించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఈఈ దామోదర్‌రావు, వ్యవసాయ శాఖ ఏడీ కనకరాజు, ఆర్‌అండ్‌బీ డీఈ నాగలక్ష్మి, మైనింగ్ నీటిపారుదల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అరెస్ట్ చేసేదాకా అంత్యక్రియలు చేయబోం..



దేదినేనిపల్లిలో మృతదేహంతో నిరసన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



గ్రామంలో పోలీసుల బందోబస్తు

● హంతకులను అరెస్ట్ చేయాలంటూ 3 రోజులుగా ఇంటి ముందే మృతదేహంతో కుటుంబసభ్యులు
● నాగర్‌కర్నూల్ జిల్లా దేదినేనిపల్లిలో ఘటన

సాక్షి, నాగర్‌కర్నూల్: మూడు రోజుల కిందట ఓ వ్యక్తిని హత్య చేసిన హంతకులను అరెస్ట్ చేసేవరకు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేది లేదంటూ ఇంటి వద్దే మూడురోజులుగా మృతదేహంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు నిరసనకు దిగిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం దేదినేనిపల్లిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతకక్షలు, వివాహేతర సంబంధం నేపథ్యంలో దేదినేనిపల్లికి చెందిన బోడమోని కాశన్న(32) ఈనెల 1న తన వ్యవసాయ పొలంలో దారుణ హత్యకు గురయ్యాడు. పాతకక్షలతో అదేగ్రామానికి చెందిన శారద, లోకేశ్, కిష్టయ్య, బీరయ్య, రాముడు, శంకర్ గొడ్డళ్లు, కత్తులతో కాశన్నపై మూకుమ్మడిగా దాడి చేసి హత్య చేశారని కాశన్న తమ్ముడు శివుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబసభ్యులు, గ్రామస్తులు బుధవారం ధర్నా చేపట్టారు. పోలీసులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించి మృతదేహాన్ని ఇంటికి తరలించారు. అనంతరం బుధవారం రాత్రికి కూడా పోలీసులు హంతకులను అరెస్ట్ చేయలేదంటూ, వారిని అరెస్ట్ చేసే వరకు కాశన్న మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేది లేదంటూ కుటుంబసభ్యులు తమ ఇంటి వద్దే మృతదేహంతో మూడు రోజులుగా నిరసన తెలుపుతున్నారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో డీఎస్పీ మోహన్‌కుమార్‌తో పాటు నలుగురు ఎస్‌ఐలు, మరో 50 మంది కానిస్టేబుళ్లతో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు.

సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా



ప్యానల్ బోర్డు వద్ద పూజలు చేస్తున్న ట్రాన్స్‌కో డైరెక్టర్ నర్సింగరావు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు శివారులో ఉన్న పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన ప్యాకేజ్ వన్, ప్యానల్ బోర్డు సమీపంలో ఉన్న 400/11కేవీ సబ్‌స్టేషన్‌కు రాష్ట్ర ప్రాజెక్టుల ట్రాన్స్‌కో డైరెక్టర్ నరసింగరావు విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ పనులు వేగవంతంగా చేస్తున్నట్లు తెలిపారు. రెండు పంపులు ప్రారంభించడానికి విద్యుత్ సమస్య లేదన్నారు. పంపులు రన్ చేయాడానికి సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఈ శ్రీరాం, ఎస్ఈ మాణిక్యరావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరెడ్డి, ఈఈలు రాంకోటి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.